సాక్షి చిత్తూరు

సోమవారం ၊ 9 ၊ అక్టోబర్ ၊ 2023



ఆర్టీసీ ఆదాయం రయ్‌రయ్

పుంగనూరు ఆర్టీసీ డిపో లాభాల బాటలో రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్తోంది. రోజూ రూ.72 లక్షల ఆదాయం వస్తోంది. - 8లో



జిల్లాలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కసరత్తు పూర్తి అయ్యింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	35	26
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

పోలీసు కార్యాలయంలో ..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి



సంఘటన స్థలంలో చిరుత పాదముద్రలు

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు అటవీ ప్రాంత పరిధిలో శనివారం రాత్రి చిరుతపులి హడలెత్తించింది. పాలాక్షప్పకు చెందిన దూడపై చిరుత దాడి చేసి చంపేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని అటవీ అధికారులు పరిశీలించారు. పాదముద్రల ఆధారంగా దూడపై దాడి చేసింది చిరుతపులి అని నిర్ధారణకు వచ్చారు. అటవీ సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

తేనెటీగల దాడిలో 15 మందికి గాయాలు

వెదురుకుప్పం: తేనెటీగల దాడిలో 15 మందికి పైగా గాయపడిన ఘటన జీడీనెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలంలోని గుడుపల్లె గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... గుండుపల్లె గ్రామ సమీపంలోని చెట్ల వద్ద తేనెటీగల తుట్టే ఉంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పిల్లలు ఆడుకుంటూ తేనె తుట్టె పైకి రాయి విసిరారు. దీంతో తేనె టీగలు చెల్లాచెదురై అక్కడున్న మనుషులపై దాడి చేశాయి. సుమారు 15 మందికి పైగా గాయపడినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనలో పక్కనే ఉన్న కొలిమి పనులు చేస్తున్న ఇద్దరిపై దాడి చేయడంతో భయభ్రాంతులతో పరుగులు తీశారు. అదేవిధంగా ప్రధాన రహదారిపై వెళ్లే ప్రయాణికులను సైతం వదల్లేదు. గ్రామంలోని ఇద్దరు పిల్లలు స్వల్పంగా గాయపడి కోలుకున్నట్లు స్థానికులు చెప్పారు. ఇదిలా ఉండగా ఎవరికీ ప్రాణాపాయం లేదని అంటున్నారు.

వరదరాజస్వామి ఆలయ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న వరదరాజ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి రివైజ్డ్ ఎస్టిమేషన్ అనుమతుల మేరకు రూ.5.90 కోట్లు మంజూరు కావడంతో పెండింగ్‌లో ఉన్న 15 లేయర్ల నిర్మాణానికి సంబంధించి టెక్నికల్ అనుమతులు వచ్చాయన్నారు. సాంకేతిక కారణాలతో మందగించిన పనులను వెంటనే వేగవంతం చేయాలన్నారు. రానున్న వైకుంఠ ఏకాదశి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించే విధంగా పనులు చేపట్టాలన్నారు. ఆలయ డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ కిషోర్, స్థపతి కుమార్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గంగాసుతుని జల విహారం



స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా ఆదివారం రాత్రి పుష్కరిణిలో జల విహారం చేస్తూ భక్తులను అనుగ్రహించారు. విద్యుద్దీప కాంతులు..పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించిన తెప్పపై స్వామివారు విహరిస్తుంటే అశేష భక్తులు జై గణేష, జైజై గణేష అంటూ తిలకించి తన్మయత్వం చెందారు.

- కాణిపాకంలో నేత్రపర్వంగా తెప్పోత్సవం
- తిలకించి పులకించిన అశేష భక్తజనం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రత్యేక వార్షిక ఉత్సవాల్లో చివరి రోజు తెప్పోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జామున ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చన పూజలు చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పపై కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామివారు పుష్కరిలో మూడు ప్రదక్షిణలు చేశారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు సాయంత్రం నుంచి పుష్కరిణి చుట్టూ కూర్చున్నారు. స్వామివారు జలవిహారం చేస్తుంటే భక్తుల జై గణేష..జైజై గణేష నామస్మరణలు మార్మోగాయి. ఆలయ ఈఓ వెంకటేశు, తాజా మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ అధికారులు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

శరణు గణేశ..చరణాలయ్యా..

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామికి ఆదివారం గణేష దీక్ష చేపట్టిన భక్తులు పెద్ద ఎత్తున ఇరుముడులు చెల్లించారు. ఆదివారం స్వామివారి తెప్పోత్సవంతో వార్షిక ప్రత్యేక ఉత్సవాలు ముగింపు సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి గణేష దీక్ష చేపట్టిన మాలాధారణ భక్తులు అశేషంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. సాధారణ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం భక్తులు దీక్షా మండపంలో ఇరుముడులు చెల్లించారు. ఉదయం నుంచి రాత్రి వరకు గణేశ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.



ఇరుముడులు చెల్లించేందుకు విచ్చేసిన గణేషమాల దీక్షా భక్తులు

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ధ్వంసమైన వరి పంటను చూపుతున్న రైతు

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పెద్దపంజాణి, సోమల మండల సరిహద్దులోని గ్రామాల్లో గత మూడు రోజులుగా ఏనుగుల గుంపు పంటలు ధ్వంసం చేస్తున్నాయి. టమాటా, చెరుకు, వరి పంటలపై విరుచుకుపడి ధ్వంసం చేస్తున్నాయి.శనివారం రాత్రి పేటూరు ఫారెస్టు బీటు నుంచి గుంపుగా వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామ రైతులు అబ్బులప్ప, గౌరీనగర్‌కు చెందిన మస్తాన్, మధుసూదన్ రెడ్డికి చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అనంతరం కీలపట్ల ఫారెస్టు బీటులోకి వెళ్లాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. ఏనుగుల కారణంగా సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల ఫారెస్టు బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ఏనుగు లు ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ పెద్దకాప్పల్లె పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, జిట్టంవారిపల్లె, ముదిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె పంట పొలాలపై ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయన్నారు. ఏనుగులు పంట పొలాలపైకి రాకుండా కట్టడి చేయాలని కోరారు. పంటల నష్టం అంచనా వేసి పరిహారం అందించాలన్నారు. ట్రాకర్ల సహాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు బీట్ ఆఫీసర్లు తెలిపారు.

చల్లా బాబుకు స్వగ్రామంలో షాక్



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



తిరుపతిసిటీ: మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి, వైస్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీలో చేరిక
- బొమ్మయ్యగారిపల్లెకు చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు టీడీపీకి గుడ్‌బై

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి సొంత గ్రామం బొమ్మయ్యగారిపల్లెలో భారీ షాక్ తగిలింది. రెండుసార్లు టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన గుండ్లూరి రామచంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ నాయకులు రాజారెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్, భాస్కర్‌శెట్టి, మునిరెడ్డి వారి అనుచరులతో కలసి వైఎస్సార్‌సీపీ వైస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలు అందించామన్నారు. కష్టకాలంలో ఆర్థికంగా తోడున్న తమకు గుర్తింపు లేదన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, నాయకులు డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న 33వ డివిజన్ పార్టీనేతలు

300 మంది టీడీపీ కార్యకర్తల చేరిక

తిరుపతి సిటీ: వైఎస్సార్ సీపీలో కొనసాగడం ఒక గౌరవం, హోదాగా భావించాలని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పద్మావతి పురంలోని ఆయన నివాసంలో తిరుపతి 33వ డివిజన్ స్కావెంజర్స్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కీలక నేత, వార్డు అధ్యక్షుడు ఎన్వీ రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు సుమారు 300 మందికి పైగా ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే భూమన వారికి పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంత పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుని నమ్మకమన్నారు. చంద్రబాబు అండ్ కో పార్టీ, పవన్ లాంటి వారు డబ్బున్న వాళ్లకు కొమ్ముకాసే వ్యక్తులని, వారిని ప్రజలు విశ్వసించరన్నారు. దూది శివ, కార్పొరేటర్ దూది కుమారి, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఇమామ్ ఆధ్వర్యంలో రమణారెడ్డి బృందం చేరికతో 33వ డివిజన్ పార్టీ మరింత బలపడిందన్నారు. 33వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు దూది శివ రాయల్ మాట్లాడుతూ సామాన్య ప్రజల సమస్యలు విని వారికి అండగా నిలిచి పోరాడే ఎమ్మెల్యే మనకు దొరకడం అదృష్టమన్నారు. తరువాత టీడీపీ నాయకులు ఎన్వీ రమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీకాంత్ ,బాలాజీ, జ్యోతి, అంజలి, లక్ష్మి, ఝాన్సీ, మహేష్ రాయల్, రామ్మోహన్, మణి ఆచారి, అనీల్ కుమార్, శేఖర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, పవన్ కుమార్, విజయ, మోహన్‌రెడ్డి, కోదండ, గుణ, రాజేశ్వరి, చరణ్ బృందానికి ఎమ్మెల్యే వైఎస్సార్ సీసీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని గజమాలతో సత్కరించారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలలోకి తీసుకెళ్లాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్నాయని, అందరం కలసి కట్టుగా పనిచేయాల్సి అవసరముందన్నారు. అనంతరం పార్టీ నాయకులు అభినయ్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. నాయకులు నరేంద్ర, పూసపాటి మోహన్‌రాజ్, ఇమ్రాన్ బాషా, దినేష్ రాయల్, లవ్లీ వెంకటేష్, పద్మజ, మద్దాలి శేఖర్ రాయల్ పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా బోయకొండ



మంత్రి పెద్దిరెడ్డి దంపతులు, ఎంపీ మిథున్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బోయకొండ ఈఓ చంద్రమౌళి



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తజన సంద్రమైంది. వరుస సెలవులు రావడంతో అమ్మవారి దర్శనం కోసం కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా అశేషంగా భక్తులు తరలివచ్చారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఉదయం నుంచి భక్తుల రద్దీతో క్యూలన్నీ కిటకిటలాడాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు.

దసరా మహోత్సవాలకు రండి

శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు కుటుంబ సమేతంగా రావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని దేవస్థానం ఈఓ చంద్రమౌళి ఆహ్వానించారు. ఆదివారం తిరుపతిలోని మంత్రి స్వగృహానికి వేద పండితులతో ఆహ్వానించేందుకు ఈఓ వెళ్లారు. ఆహ్వాన పత్రికను మంత్రి దంపతులు, ఎంపీకి అందజేశారు. వేదపండితులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి, ఆశీర్వచనం చేశారు.



బోయకొండలో ఆదివారం భక్తుల రద్దీ

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 72,309 మంది స్వామివారిని దర్శించుకోగా 26,296 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో ఎంపీ మిథున్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వర రావు, మేరుగు నాగార్జున దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఆర్టీసీ ఆదాయం రయ్‌రయ్





పుంగనూరు ఆర్టీసీ డిపో ప్రారంభోత్సవంలో ఎంపీ మిథున్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణ్(ఫైల్), పుంగనూరు ఆర్టీసీ డిపో

మూడు దశాబ్దాల ఎదురు చూపులకు తెరదించుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో ప్రారంభించిన పుంగనూరు ఆర్టీసీ డిపో లాభాల బాటలో నడుస్తోంది. ప్రయాణికులకు సౌకర్యంగా మారడంతోపాటు రోజూ 77 సరీ్వసుల ద్వారా రూ.12 లక్షల ఆదాయం వస్తోంది. కార్గో సర్వీసుతో రూ.7వేలు రాబడి వస్తోంది. రూ.4 కోట్లతో డిపోను..ఉద్యోగుల భవనాలను అత్యంత సుందరంగా నిర్మించారు. పట్టణానికి గుర్తింపు వచ్చేలా మంత్రి కుటుంబం చేసిన కృషిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

- పుంగనూరు డిపోకు ఏటా రూ.18 కోట్ల రాబడి
- 77 సర్వీసులు..తీరిన ప్రయాణ కష్టాలు
- కార్గోతో మరింతగా..
- మంత్రి పెద్దిరెడ్డి కృషి ఫలితం

పుంగనూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతోనే మంత్రి పెద్దిరెడ్డి చొరవతో పట్టణంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు కావడం తమ అదృష్టంగా ప్రజలు భావిస్తున్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద రూ.15 కోట్లు విలువ చేసే సుమారు 5 ఎకరాల స్థలాన్ని మంత్రి పెద్దిరెడ్డి డిపో నిర్మాణానికి కేటాయించారు. రూ.4 కోట్లతో డిపోను నిర్మించారు. డిపోలో గ్యారేజీ, డీజల్ బంకు, ఉద్యోగులకు భవనాలు నిర్మించారు. డిపోకు ప్రహరీ నిర్మించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్ల కిందట అమరావతి నుంచి వర్చువల్ విధానంలో డిపోను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి, అప్పటి కలెక్టర్ హరినారాయణ్, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

50 రూట్లు..77 సర్వీసులు..

డిపోలో 77 సర్వీసులు ఉన్నాయి. ఇందులో 50 రూట్లలో బస్సులను నడుపుతున్నారు. పుంగనూరు నుంచి తిరుమల, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు జిల్లా కేంద్రాలకు, స్థానిక పట్టణాలకు, పల్లెలకు బస్సులను నడుపుతున్నారు. ప్రతి రోజూ 33 వేల కిలో మీటర్లు ప్రయాణిస్తూ, ప్రజలను తమ గమ్యాలకు చేర్చడంలో ఆర్టీలో అగ్రస్థానంలో నిలిచింది. డిపోలో మొత్తం డ్రైవర్లు, కండెక్టర్లు, సిబ్బంది కలసి 349 మంది పని చేస్తున్నారు.




బైపాస్‌లో నిర్మించిన ఆర్చి

రోజు రూ12 లక్షల ఆదాయం...

డిపోలో ప్రతి రోజూ 77 సర్వీసుల ద్వారా రూ.12 లక్షల లెక్కన ఏటా రూ.18 కోట్ల ఆదాయం లభిస్తోంది. డిపో ప్రారంభమైన తొలి సంవత్సరంలో నష్టాల బాటలో నడిచినా ప్రస్తుతం డిపో లాభాల బాటలో పయనిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆర్టీసీలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో సర్వీసు ద్వారా రోజుకు రూ.7 వేలు ఆదాయం లభిస్తోంది. వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, డిపో మేనేజర్ సుధాకరయ్య, కార్మిక సంఘం నాయకుడు కరీముల్లా ఆధ్వర్యంలో ఉద్యోగులు సొంత డిపోలా భావించి ఆదాయం పెరిగేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకించి పుంగనూరుకు డిపో కేటాయించారు. 30 సంవత్సరాలుగా పుంగనూరును ఏలిన ఒకే కుటుంబం డిపో ఏర్పాటు చేయకుండ నిర్లక్ష్యం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జగన్‌మోహన్‌రెడ్డి డిపో ప్రారంభించడంతో పుంగనూరుకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అన్ని ప్రాంతాలకు పుంగనూరు నుంచి బస్సులను నడుస్తున్నాయి. పుంగనూరు అభివృద్ధికి ప్రత్యేకంగా సహకరిస్తున్న ముఖ్యమంత్రికి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు. **- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి**

ప్రజలకు ఆర్టీసీ సేవలు



పుంగనూరులో డిపో ఏర్పాటైన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా బస్సులను నడపుతున్నాం. మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు బస్సులు కేటాయించాం. ఆప్రాంతాల్లో బస్సులు లేక ఆటోల్లో ప్రయాణిస్తూ ప్రజలు, విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యేవారు. వీటిని గుర్తించి విద్యార్థులకు, ప్రజలకు ఆర్టీసీ బస్సులను కేటాయించాం. ప్రయాణ కష్టాలు తీర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- జయరామిరెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్

వైఎస్సార్‌సీపీతో నెరవేరింది..



ముప్పై సంవత్సరాలు ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని ఎన్నో పోరాటాలు చేశాం. కేసుల్లో జైలుకు వెళ్లాం. గత ప్రభుత్వాలు డిపో ఏర్పాటు చేయకుండా ప్రైవేటు వారితో కుమ్మక్కయ్యాయి. పుంగనూరు ప్రజల అదృష్టం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం, మంత్రి పెద్దిరెడ్డి డిపో ఏర్పాటు చేయించారు. ప్రభుత్వానికి , మంత్రి కుటుంబానికి కార్మికుల తరపున కృతజ్ఞతలు.

- కరీముల్లా, ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుడు

క్లుప్తంగా

సీపీఎస్‌ఈఏ జిల్లా నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీసీపీఎస్‌ఈఏ (ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా కేంద్రంలోని సీబీరోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సమీర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా లత, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, అదనపు ప్రధాన కార్యదర్శిగా అమర్నాథ్, కోశాధికారిగా రాజేష్, మహిళా అధ్యక్షురాలుగా సుబ్బలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు సమీర్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేస్తే ఎంతో మంది ఉద్యోగులకు మేలు కలుగుతుందన్నారు. 1998 డీఎస్సీ టీచర్ల నియామకాల తరహాలో రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కలసి కట్టుగా సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

ఎనిమిది మంది పేకాట రాయుల అరెస్టు

తిరుపతి క్రైమ్: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ అప్పన్న తెలిపారు. సీఐ కథనం మేరకు.. మధురానగర్లోని సెవెన్ హిల్స్ స్కూల్ పక్కన ఓ ఇంట్లో జూదమాడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీనిపై స్పందించిన సీఐ సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.16,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దొరవారిసత్రం: మండలంలోని కలగుంట సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద డౌన్ లైన్ పట్టాలపై రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకోగా ఆదివారం వెలుగుచూసింది. సూళ్లూరుపేట రైల్వే పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే రైలు నుంచి 50–55 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడిపోయి మృతి చెందాడు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతుడు నీలిరంగు గళ్ల చొక్కా, నేవీబ్లూ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమర్టమ్ నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ శివసామ్య తెలిపారు.

పట్టపగలే చోరీ

తిరుపతి క్రైమ్: కొర్లగుంటలోని బాలాజీ హాస్పిటల్ వెనకవైపు ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసులు కథనం మేరకు.. టీవీ మెకానిక్ లీలాకృష్ణ బాలాజీ హాస్పిటల్ వెనక వైపు ఉన్న మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. సొంత పనులు నిమిత్తం శనివారం ఉదయం భార్యాభర్తలిద్దరూ పాకాలకు వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా సుమారు 120 గ్రాములు బంగారం చోరీ జరిగినట్టు గుర్తించారు. దీనిపై ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలంలో వేలిముద్రలు సేకరించారు.

జనహృదయ నేతకు ఘన నివాళి

వి.కోట: స్థానిక వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షురాలు ఆదివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి ఘన నివాళులర్పించారు. ఆమె భర్త, వి.కోట పంచాయతీ వార్డు మెంబర్ (వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి) కుమార్‌రాజా మాట్లాడుతూ ప్రతి ఏడాదీ పితృపక్షోత్సవాల్లో (పెద్దలకు పిండం ప్రధానం) భాగంగా తమ అభిమాన నేత, ఆరాధ్యదైవం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి పిండ ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నట్టింట మహానేత ఫొటో ఉంచి, పురోహితుడిచేత శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. అనంతరం పిండ ప్రదానం చేసి శ్రద్ధాంజలి ఘటించారు.



వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న శశికళ, కుమార్ రాజా

జిల్లాలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

- ముగిసిన పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్
- కొత్తగా 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ప్రతిపాదనలు పంపిన కలెక్టరేట్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు కలెక్టరేట్ అధికారులు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కసరత్తు పూర్తి చేశారు. గతంలో జిల్లాలోని పుంగనూరు, నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం మొత్తం ఏడు నియోజకవర్గాల్లో 1737 పోలింగ్ స్టేషన్‌లు ఉండేవి. ఎన్నికల సంఘం నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తూ పలు మార్పులు చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సూచనలు, అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా స్వీకరించారు. అనంతరం తుది ప్రతిపాదనలు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదానికి పంపారు.

ప్రతిపాదనలు ఇలా..

జిల్లాలో కొత్తగా పుంగనూరులో ఒకటి, నగరిలో 4, చిత్తూరులో 4, పూతలపట్టులో 18 మొత్తం 27 పోలింగ్ కేంద్రాలని ప్రతిపాదించారు. పలు కారణాలతో పుంగనూరులో 7, నగరిలో 2, జీడీ నెల్లూరులో 9, చిత్తూరులో 3, పూతలపట్టులో 12, పలమనేరులో 8, మొత్తం 41 కేంద్రాల ప్రాంతాలను మార్పు చేశారు. పుంగనూరులో 1, జీడీ నెల్లూరులో 14 మొత్తం 15 కేంద్రాల పేర్లను మార్చారు. నగరిలో 1, చిత్తూరు లో 1 మొత్తం 2 పోలింగ్ కేంద్రాల విలీనం, తొలగింపునకు ప్రతిపాదనలు పంపారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు..

ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్ ప్రక్రియలో పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో గతంలో 1737 పోలింగ్ కేంద్రాలుండేవి. ఎన్నికల నిబంధనల మేరకు కొత్తగా 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో రేషనలైజేషన్ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1762కు చేరింది. కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనల ప్రకారం జిల్లాలోని పుంగనూరులో 262, నగరిలో 229, జీడీ నెల్లూరులో 255, చిత్తూరులో 226, పూతలపట్టులో 260, పలమనేరులో 287, కుప్పంలో 243 మొత్తం 1762 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కలెక్టరేట్ అధికారులు ఎన్నికల సంఘానికి ప్రతిపాదించారు.

పకడ్బందీగా రేషనలైజేషన్ ప్రక్రియ



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో పలు మార్లు సమావేశం నిర్వహించాం. వారి నుంచి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా స్వీకరించాం. క్షేత్ర స్థాయిలో పోలింగ్ స్టేషన్‌ల ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాం. తుది ప్రతిపాదనలు ఎన్నికల సంఘానికి పంపాం.

- షణ్మోహన్, కలెక్టర్

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

● ఫైనల్‌కు చేరుకున్న గుంటూరు, విజయనగరం జట్లు



సెమీఫైనల్లో తలపడుతున్న శ్రీకాకుళం - విజయనగరం జిల్లాల బాలుర జట్లు

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరులో రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరగుతున్నాయి. బాలికల విభాగంలో గుంటూరు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు – ప్రకాశం జిల్లాలు తలపడగా ప్రకాశం జిల్లాను ఓడించి గుంటూరు ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో శ్రీకాకుళం – విజయనగరం జిల్లాల మధ్య మొదటి సెమీ ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో విజయనగరం శ్రీకాకుళం జిల్లాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. సోమవారం బాలికల విభాగంలో చిత్తూరు – కడప జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఫైనల్లో గుంటూరు జిల్లాతో తలపడనుంది. అదే విధంగా బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి – అనంతపురం జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో విజయనగరం జిల్లాతో ఆడనుంది.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి : గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ ఎక్స్‌పర్ట్ షామీర్ బాషా అన్నారు. ఆదివారం ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి తర్వాత దేశానికి ప్రాతినిధ్యం వహించి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు షామీర్‌బాషాను సత్కరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: చిత్తూరు మండలం ఏనుగుంట్లపల్లెలో ఆదివారం ఎస్‌ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో చంద్రప్రకాష్ (35) అనే వ్యక్తి వద్ద 288 ప్యాకెట్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. అతని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాబు, రాంప్రసాద్, సిబ్బంది శంకరనాయక్, బాబు, జయశంకర్, సురేంద్ర, వెంకటేష్, సాలాక్షి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

క్రీడలతో మానసిక వికాసం

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–17 తైక్వాండ్ పోటీలు ప్రారంభం

తిరుపతి రూరల్: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసం పెరుగుతుందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ –17 బాలబాలికల తైక్వాండ్ పోటీలు, ఎంపిక ప్రక్రియ ఆదివారం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జరిగాయి. ఈ పోటీలకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థుల్లో ఆత్మరక్షణకు సంబంధించి క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ఇలాంటి పోటీలను పట్టణాలకే పరిమితం కాకుండా పల్లెల్లో కూడా ప్రారంభించాలన్నారు. నాడు– నేడు పథకం కింద ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు అందంగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. చిన్నారుల్లో క్రీడాశక్తిని పెంపొందించేందుకు తన వంతు బాధ్యతగా వ్యవహరిస్తానని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, ఆ దిశగా వారిని గొప్పగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ తైక్వాండో పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మొదటిసారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాను ఎంపీటీసీ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్న పెరుమాళ్లపల్లె పాఠశాల వేదిక కావడం సంతోషకరమన్నారు. ఈ పోటీలకు చిత్తూరు, తిరుపతి అన్నమయ్య జిల్లాల నుంచి సుమారు వందమంది బాలబాలికలు హాజరుకానున్నట్లు కార్యనిర్వహణ కార్యదర్శి బట్టు నాగమల్లేశ్వరి తెలిపారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రూ.25 వేలు విరాళం

తైక్వాండో క్రీడలను ప్రోత్సహించేందుకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పెరుమాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌కు రూ.25 వేలు వ్యక్తిగత నగదు విరాళంగా అందజేశారు. తైక్వాండోకు కావాల్సిన మాట్స్ కొనుగోలు చేయాలని సూచించారు. 2017 నుంచి సుమారు జిల్లాస్థాయికి 73 మంది, రాష్ట్ర, జాతీయ స్థాయికి 14 మంది ఎంపికై పతకాలు సాధించారని తెలిపారు. ఈ ఘనత పెరుమాళ్లపల్లె పాఠశాలకు దక్కిందన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వరరెడ్డి, సర్పంచ్ జోగి మోహన్, ఉప సర్పంచ్ వెంకట్ నారాయణ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్ బాబు, జిల్లా వ్యాయామ సంఘం కార్యదర్శి బొందు సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.